క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించండి

నర్సాపూర్: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని 10, 11 వార్డుల్లో కొనసాగుతున్న మురికి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, ఆంజనేయులుగౌడ్, నగేశ్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐని సన్మానిస్తున్న చత్రునాయక్

నర్సాపూర్: ఇటీవల నర్సాపూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రంగకృష్ణను పలువురు నాయకులు, ఆయా శాఖల అధికారులు శనివారం సన్మానించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముంబాయి ఏరియా జనరల్ మేనేజర్ చత్రునాయక్ శనివారం సీఐని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశ్, ఇతర పార్టీ నాయకులు చిన్న అంజిగౌడ్ పాల్గొన్నారు.

ప్యూరిఫైడ్ అందజేత


ప్యూరిఫైడ్ అందిస్తున్న దాత

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన భవాని నాగేశ్‌స్వామి శనివారం డిస్పెన్సర్ ప్యూరిఫైడ్‌ను అందించారు. దీంతో దాతను హెచ్‌ఎం సుజాత అభినందించారు. ఇందులో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, శివశంకర్, అర్చన, ఇందిర, రాధిక, రాణి తదితరులతో పాటూ గ్రామ నాయకులు, శివస్వాములు రాజు, రాము, గణేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు మండల పరిధి శభాష్‌పల్లి సత్యం విద్యా మందిర్ విద్యార్థి ఎంపికయ్యాడు. శనివారం మెదక్‌లో సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ప్రతిభా పాటవ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన సోహన్ దీప్‌సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఎంఈఓ బుచ్చనాయక్, ప్రిన్సిపాల్ మహేందర్, మండల సోషల్ ఫోరమ్ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్‌గుప్తా అభినందించారు.

చేగుంట ప్రత్యేక అధికారిగా తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ గియాసున్నీసా శనివారం బాధ్యతలను స్వీకరించారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం


వేంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ వేంకటేశ్వర కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి భూదేవి, శ్రీదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయంలో ఊరేగించి కల్యాణం చేశారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్, స్వామి, కృష్ణతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల పాఠశాల స్థలం కబ్జా


రైతులు పొలాలకు వెళ్లకుండా ఇరువైపుల వేసిన ఫెన్సింగ్

- భుజిరంపేటలో ఎస్టీ గురుకులానికి 7 ఎకరాల స్థలం కేటాయింపు
- నిర్మాణానికి రూ. 4 కోట్లు మంజూరు
- పనులు ప్రారంభం కాకపోవడంతో కబ్జా చేస్తున్న అక్రమార్కులు


భుజిరంపేటలో ఎస్టీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలం వద్ద వేసిన ఫెన్సింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కొంత మంది వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. రూ. కోట్లు విలువ చేసే భూమి ఖాళీగా ఉండటంతో తోటి రైతులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాబ్జా చేస్తూ చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారు. కౌడిపల్లి మండలంలోని భుజిరంపేట సర్వేనంబర్ 595లో అప్పటి దివంగత జెడ్పీ వైస్ చైర్మన్ చిలుముల ఆశిరెడ్డి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల కోసం 9 ఎకరాలు కేటాయించారు. వివిధ కారణాలతో పాఠశాల మంజూరు కాలేదు. దీంతో భూమి అలాగే ఉంది. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత నియోకవర్గంలో గురుకుల పాఠశాలలు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కృషితో కౌడిపల్లి మండలానికి బీసీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయి. ఇక్కడ అద్దె భవనాలు దొరకక పోవడంతో బీసీ గురుకుల పాఠశాల మొదట్లో కౌడిపల్లి బీసీ హాస్టల్‌లో అనంతరం తునికి గురుకులంలోకి మార్చారు. ఎస్టీ గురుకులం సైతం మొదట నర్సాపూర్ అనంతరం మెదక్‌లో కొనసాగించగా ప్రస్తుతం కౌడిపల్లిలో కొనసాగుతోంది. ఇదిలా ఉండగా ఎస్సీ గురుకుల పాఠశాల కోసం గత ప్రభుత్వం భుజిరంపేటలోని సర్వేనంబర్ 595లోని భూమి సర్వేచేసి 7 ఎకరాలు కేటాయించి భూమి పత్రాలను ఎస్టీ వెల్ఫేర్ అధికారులకు రెవెన్యూ అధికారులు అందజేశారు.

రూ. 4కోట్లు మంజూరు

గురుకుల పాఠశాలకు స్థలం లభించడంతో అప్పటి ప్రభుత్వం నిర్మాణానికి రూ. 4కోట్లు మంజూరు చేసింది. కానీ వివిధ కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏళ్ల తరబడి భూమి ఖాళీగా ఉంది. దీంతో అదే ప్రాంతంలో భూమిని కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేశారు. ఆ స్థలంలోని సమీప రైతులు వారి పొలాల్లోకి వెళ్లకుండా ఇరువైపుల ఫెన్సింగ్ వేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కొత్తభవనం నిర్మించాలి

ప్రస్తుతం ఎస్టీ గురుకుల పాఠశాల కౌడిపల్లిలో కొనసాగుతోంది. అద్దె భవనంలో ఉండటంతో విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం నిర్మిస్తే.. విద్యార్థులకు సమస్య తీరుతుంది.

స్థలం కాపాడండి



ఎస్టీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కాపాడండి. ప్రస్తుతం భూమి విలువ పెరగడంతో కబ్జాల పర్వం కొనసాగుతోంది. అధికారులు స్పందించి స్థలం కాపాడాలి.

– లక్ష్మణ్, మాజీ సర్పంచ్ భుజిరంపేట

చర్యలు తీసుకుంటాం

మండలంలోని భుజిరంపేటలో ఎస్టీ గురుకుల పాఠశాలకు ప్రభుత్వం 7 ఎకరాలు కేటాయించింది. పాఠశాలకు కేటాయించిన స్థలం కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– అంజనేయులు, తహసీల్దార్, కౌడిపల్లి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యం, ప్రమాదంతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చండీ, గంగాయిపల్లి గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఉసిరికపల్లికి చెందిన మణిచరణ్‌కు రూ.లక్ష యాభై వేల ఎల్‌ఓసీ అందజేశారు. అనంతరం చండీ గ్రామంలో కొలువైన చండీ కాంబను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, మహేందర్ రెడ్డి, వీరేశ్, ఆంజనేయులు, కుంట లక్ష్మణ్, శ్రీశైలం, అశోక్‌రెడ్డి, నర్సారెడ్డి, రేణుకుమార్, సంజీవచారి, ముత్యంరెడ్డి, అంజిరెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో బాధిత కుటుంబాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మంజుల, ఉపసర్పంచ్ చెన్నయ్య, నాయకులు రాజాగౌడ్, సంతోష్ కుమార్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం



పెద్దశంకరంపేటలో స్వయంపరిపాలన దినోత్సవం


అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌గా నాగరాజు, డీఈఓ బాలరాజు, ఎంఈఓగా శ్రీకాంత్, హెచ్‌ఎం రాకేశ్, పలువురు విద్యార్థులు సబ్జెక్టు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధనుంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా బీరప్ప, డీఈఓగా భాగ్యశ్రీ, కలెక్టర్‌గా అమన్, డిప్యూటీ డీఈఓగా కుమార్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు సత్యకుమార్, దయానంద్, పడాల సుధీర్, హన్మండ్లు తదితరులు పర్యవేక్షించారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారం ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. డీఈఓగా శుక్లవర్ధన్, హెచ్‌ఎం బుశ్రా, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు.


శివ్వంపేట(నర్సాపూర్): గోమారం ఉన్నత పాఠశాలలో..

విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి


సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మగ్దుంపూర్ ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్ అన్నారు. మగ్దుంపూర్‌లోని జోసఫ్ పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజీవ్ వర్గీస్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకమండలికి సన్మానం


గౌతాపూర్‌లో పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న కార్యదర్శి దుర్గ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామ పాలకమండలిని శనివారం పంచాయతీ కార్యదర్శి దుర్గ సన్మానించారు. గడచిన ఐదేళ్లలో గౌతాపూర్ గ్రామ అభివృద్ధిలో పాలకమండలి ఎంతగానో కృషి చేసిందని అన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు కార్యదర్శిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, వార్డు సభ్యులు, నాయకులు మాణిక్యరెడ్డి, విఠల్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని పీర్యతండా గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని శనివారం తండావాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లచ్చనాయక్, ఎంపీటీసీ సత్తయ్య, ఎంపీఓ కలీముల్ల, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు, తండావాసులు పాల్గొన్నారు.

నియామకం


పరమేశ్వర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా కొంపల్లిలో పీఆర్టీయూ తెలంగాణ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించగా, మండలంలోని వల్లభాపూర్ పాఠశాలలో పని చేస్తున్న పరమేశ్వర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంగరాయి అభివృద్ధికి నిధులు మంజూరు



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామ అభివృద్ధికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలో ఆమె మాట్లాడుతూ.. జంగరాయి గ్రామ అభివృద్ధికి నిధులు అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

నేడు మల్లన్న మూడో వారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నేడు మూడో ఆదివారం భక్తులు భారీగా తరలిరానున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి వారాల్లో మూడోవారం కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు మల్లన్నకు పట్నం వేసి బోనం సమర్పిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యా సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెదక్: మెదక్ జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సదస్సులో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రామ్‌రెడ్డి కోరారు. ద్వారకా గార్డెన్‌లో నిర్వహించే విద్యా సదస్సును విజయవంతం చేయాలని శనివారం మెదక్ రూరల్, టౌన్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి కోరారు. కార్యక్రమంలో వివిధ సెషన్‌లలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మున్సిపాల్ చైర్మన్ చంద్రపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, నాగిరెడ్డి, రవిందర్, కె.వేణుగోపాల్ పాల్గొంటారని తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీసు అందిస్తున్న నర్సమ్మ

కొల్చారం(నర్సాపూర్): దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డికి శనివారం సమ్మె నోటీసు అందజేశారు. శనివారం ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన సమ్మెకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లేశం, నాగరాజు, అజయ్, కరుణాకర్, చంద్రయ్య, ప్రభాకర్, దాసు తదితరులు ఉన్నారు.

ల్యాండ్ సర్వేయర్ల పాత్ర కీలకం


నియామకపత్రం అందిస్తున్న నరేందర్

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్: వ్యవసాయ భూముల తగాదాల నివారణకు సర్వేయర్ల పాత్ర కీలకమని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. శనివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన సర్వేయర్ల సర్వసభ్యసమావేశం, ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సర్వేయర్ల డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడుగా జి.యాదగిరిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎండీ ఇక్బాల్, ఉపాధ్యక్షుడుగా శశికుమార్ ఎన్నికయ్యారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు


అంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ ఉన్నారు.

విద్యార్థులకు అస్వస్థత


రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని బీకొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. పాఠశాలలో ఉదయం విరామ సమయంలో ఏడోతరగతి విద్యార్థులు లడ్డూ ప్రసాదం తీసుకున్నారు. కొద్ది సేపటికి కొతమంది విద్యార్థులకు కడుపునొప్పి రావడంతో వాంతులు చేసుకున్నారు. దీంతో స్పందించిన ఉపాధ్యాయులు వారిని 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఆపాయం లేదని, ఫంగస్ ఉన్న ఆహారం తినడంతో విద్యార్థులు ఇబ్బందులు పడినట్లు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురైన ఐదు మంది విద్యార్థులు పానీపూరీ తిన్నారని, దానితోనే వారికి వాంతులు జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం మెరుగుగానే ఉండటంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాలెండర్ ఆవిష్కరణ

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కాలెండర్‌ను మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సాయికుమార్, సిద్దేశ్, ప్రభాకర్‌రెడ్డి, రెహనా, నర్సింహ, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

◆ చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మనోహరాబాద్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు రమేశ్ (28) మృతి చెందాడు. దీంతో ఆ మృతదేహానికి తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ. 10 వేలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్, మనోహరాబాద్, తూప్రాన్, శివ్వంపేట్ మండల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

◆ విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన కడమంచి రమేశ్(20) శుక్రవారం అర్ధరాత్రి గడికోట శివారులోని కిరాణం దుకాణంపైకి ఎక్కాడు. దీంతో అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

◆ రసాయన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



చేగుంట(తూప్రాన్): రసాయన పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ గియాసున్నీసాబేగంకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామశివారులోని సప్తగిరి ఫార్మపరిశ్రమ వ్యర్థాలతో పంటలు పాడవుతున్నాయని తెలిపారు. రెండేళ్లుగా పంటలు పాడవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.